క్లుప్తంగా

నేటి నుంచి రేషన్ పంపిణీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జిల్లా వ్యాప్తంగా శనివారం నుంచి రేషన్ పంపిణీ చేయనున్నట్లు డీఎస్ఓ శంకరన్ తెలిపారు. మొత్తం 1,339 చౌక దుకాణాల పరిధిలోని 5,31,019 కార్డుదారులకు బియ్యంతో పాటు చక్కెర, కందిపప్పు అందించనున్నారన్నారు. ఇందుకుగాను ప్రభుత్వం జిల్లాకు 15 వేల మెట్రిక్ టన్నుల బియ్యం, 3 వేల మెట్రిక్ టన్నుల చక్కెర, 5 టన్నుల కందిపప్పు అందించినట్లు ఆయన పేర్కొన్నారు.

శ్రీకాళహస్తీశ్వరుడికి పట్టువస్త్రాల సమర్పణ


పట్టువస్త్ర సమర్పణలో ఆలయ అధికారులు

కాణిపాకం: శ్రీకాళహస్తిలోని స్వామి వారికి కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయ తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయ అధికారులు స్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈవో పెంచలకిషోర్ దంపతులు, అక్కడి ఈవో బాపిరెడ్డి, డీఈఓ కృష్ణారెడ్డి, ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి ఊరేగింపుగా వెళ్లి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆలయ అధికారులు ఈవో పెంచల కిషోర్‌కు ప్రత్యేక స్వామి దర్శనం కల్పించి, స్వామి ఆశీర్వచనాలు, ప్రసాదం అందజేశారు.

సోది అలంకారంలో అంకాళపరమేశ్వరి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మహాశివరాత్రిని పురస్కరించుకుని చిత్తూరు నగరం గుర్రప్పనాయుడు వీధిలోని శ్రీ అంకాళపరమేశ్వరి ఆలయంలోని అమ్మవారు శుక్రవారం సోది అలంకారంలో దర్శనమిచ్చారు. మూలస్థానంలోని అమ్మవారికి అభిషేక పూజలు చేశారు. ఉదయం మహాభిషేకం, పుష్పాలంకారం, చందనాలంకారం చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి దీపారాధన చేసి సోది అలంకారంలో అమ్మవారిని అలంకరించారు. మహానైవేద్యం, మహాకుంభ సమర్పణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేసి నిష్ఠతో తరించారు.

పాత బస్టాండు వ్యాపారుల నిరసన

చిత్తూరు అర్బన్: నగరంలోని పాత బస్టాండు వ్యాపారులు శుక్రవారం స్థానిక గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ బస్టాండ్‌లో వాణిజ్య సముదాయం నిర్మిస్తామంటూ కార్పొరేషన్ అధికారులు వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. కొందరి దుకాణాలకు విద్యుత్ సరఫరా ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. అధికారుల నిర్ణయం వల్ల వందలాది కుటుంబాలు రోడ్డున పడుతాయని విషయాన్ని గ్రహించాలన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు షాప్ కీపర్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్‌లో పూతలపట్టు విద్యార్థుల ప్రతిభ

పూతలపట్టు(కాణిపాకం): జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీలో మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారు. పశ్చిమగోదావరి జిల్లాలో జరిగిన ఈ పోటీల్లో 10వ తరగతి విద్యార్థి పూర్ణేష్ అండర్–19 సాఫ్ట్‌బాల్‌లో ఎస్‌జీఎఫ్ పోటీల్లో సత్తా చాటి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు. 9వ తరగతి విద్యార్థిని పవిత్ర బాలిక జట్టులో ఉత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

పిల్లల ఎదుగుదలకు అంగన్‌వాడీలే కీలకం

గుడిపాల: పిల్లల ఎదుగుదలకు అంగన్‌వాడీలే కీలకమని అంగన్‌వాడీ సీడీపీవో శ్యామ్‌సుగుణ కుమారి తెలిపారు. వసంతాపురంలో అంగన్‌వాడీలకు శుక్రవారం సెక్టార్ మీటింగ్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆటపాటలతో విద్యార్థులకు విద్యను నేర్పించాలని చెప్పారు. అనంతరం నెలవారీ రికార్డులను ఆమె పరిశీలించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. బసవాపల్లె అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని ఆమె తెలియజేశారు. ప్రతి విద్యార్థికి పౌష్టికాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ తోయాద్రాక్షి పాల్గొన్నారు.

సృజన దీపిక - విజ్ఞాన వేదిక


ఐరాల: విద్యార్థులు తయారు చేసిన నమూనాలు తిలకిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు


బంగారుపాళెం: టేకుమంద పాఠశాలలో ఒకే కక్ష్యలో చేరిన గ్రహాల ప్రదర్శన


అపోలో ఆస్పత్రిలో ప్రయోగాలను వివరిస్తున్న విద్యార్థులు


తవణంపల్లె: ప్రయోగాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

- ఆకట్టుకున్న విద్యార్థుల ప్రయోగాలు
- పలు పోటీల్లో విజేతలకు బహుమతులు
- పాఠశాలల్లో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

ఐరాల: వైజ్ఞానిక ప్రదర్శనలు చిన్నారుల సృజనాత్మకతకు వేదికగా మారాయి. ప్రభుత్వ పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవం వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కాణిపాకం జెడ్పీ హైస్కూల్‌లో వైజ్ఞానిక ప్రదర్శనను హెచ్‌ఎం చంద్రశేఖర్‌నాయుడు ప్రారంభించారు. శాస్త్రవేత్తల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మన దేశం ప్రయోగించిన వివిధ రాకెట్, ఉపగ్రహ, వైజ్ఞానిక నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. వీటిని సీఆర్పీ పరిధిలోని ఉపాధ్యాయులు, విద్యార్థులు తిలకించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ప్రతి విద్యార్థి శాస్త్రవేత్తగా ఎదగాలి

తవణంపల్లె: మండల కేంద్రంలోని హైస్కూల్లో ఎంఈఓ త్యాగరాజులు రెడ్డి సైన్స్ ప్రయోగాల ప్రదర్శనను ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రయోగాల ప్రదర్శనను ఎంఈఓ త్యాగరాజులు రెడ్డి, హెచ్‌ఎం దేవరాజులురెడ్డితో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు సందర్శించారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

ఒకే కక్ష్యలోకి గ్రహాలు

బంగారుపాళెం: మండలంలో విద్యార్థులు సైన్స్ ప్రదర్శనలను ఎంఈఓలు నాగేశ్వర్‌రావు, రమేష్‌బాబు ప్రారంభించారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సైన్స్‌మేళానిర్వహించారు. సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఉత్తమ ప్రయోగాలను ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. టేకుమంద జెడ్పీ హైస్కూల్లో సైన్స్ ఉపాధ్యాయులు షంషీర్‌ఖాన్, విజయ కుమారి రామన్ ఫలితం, దాని అనువర్తనాలు వివరించారు. ఇటీవల సౌరకుటుంబంలోని గ్రహాలు ఒకే కక్ష్యలో చేరిన ఘట్టాన్ని వివరిస్తూ రూపొందించిన ప్రదర్శన అందరినీ ఆకర్షించింది.

నైపుణ్యాన్ని వెలికితీసేందుకే..

గుడిపాల: విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని వెలికితీసేందుకే సైన్స్ మేళా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు విద్యాశాఖాధికారి హసన్‌బాషా, గణపతి తెలిపారు. మండలంలోని ఏఎల్‌పురం, నరహరిపేట, బొమ్మసముద్రం జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం సైన్స్‌మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సైన్స్‌మేళాలో ముఖ్యంగా సూర్యగ్రహణం, చంద్ర గ్రహణాలు ఏర్పడే విధానాన్ని, ఈసైన్స్‌మేళాలో ప్రదర్శించారు. గుండెకు సంబంధించి నమూనాను కూడా విద్యార్థులు తయారు చేసిన విధానం ఆకట్టుకుంది.

ఘనంగా జాతీయ వైజ్ఞానిక దినోత్సవం

కాణిపాకం: యాదమరి ఉన్నత పాఠశాలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ వైజ్ఞానిక ప్రదర్శనను ఘనంగా నిర్వహించారు. ప్రదర్శనలో పాఠశాల, క్లస్టర్ స్థాయిలో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. సర్ సివి రామన్ జీవిత విశేషాలు, ఆయన చేసిన ఆవిష్కరణలు, వాటి ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. మురకంబట్టు అపోలో కళాశాలలో జాతీయ వైజ్ఞానిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ ప్రదర్శనకు 70 మందికి పైగా పలు పాఠశాల విద్యార్థులు హాజరయ్యారు. వీరు 175పైగా ప్రయోగాలను చేసి చూపించారు. ఇదులో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు బహుమతి అందజేశారు.

విద్యార్థులు సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలి

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులు సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలని బృందావన్ సీబీఎస్ఈ పాఠశాల చైర్మన్ శైలజా కుమారి అన్నారు. ఈ మేరకు శుక్రవారం సంతపేట వద్ద ఉన్న ఆ పాఠశాలలో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు వివిధ సైన్స్ ప్రయోగాలను రూపొందించారు.







గుడిపాల: విద్యార్థుల ప్రయోగాల ప్రదర్శన, చిత్తూరు బృందావన్ పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శన, బంగారుపాళెం: విద్యార్థుల నమూనాలను పరిశీలిస్తున్న ఎంఈఓ రమేష్‌బాబు

అవినీతి అధికారుల గుండెల్లో దడ!

- రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీకి పట్టుబడ్డ చంద్రగిరి పంచాయతీ ఈఓ
- నాడు స్థానిక ముఖ్యప్రజాప్రతినిధి సతీమణికి రూ.50 లక్షలు సమర్పణ!
- నేడు అవినీతి కేసులో పట్టుబడి నెల్లూరు సెంట్రల్ జైలుకు
- డబ్బులిచ్చి పోస్టింగ్ తెచ్చుకున్న అధికారుల గుండెల్లో గుబులు
- ఏసీబీ చేతిలో కీలక సమాచారం


పట్టుబడిన నగదుతో ఈవో మహేశ్వరయ్య


రికార్డులు పరిశీలిస్తున్న ఏసీబీ అధికారులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: అవినీతి అధికారుల గుండెల్లో దడ మొదలైంది. ప్రజాప్రతినిధులకు లంచమిచ్చి పోస్టింగ్ తెచ్చుకున్న వారి వెన్నులో వణుకు పుడుతోంది. ఏసీబీ అధికారుల చేతిలో కీలక ఆధారాలు ఉండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని లంచావతారమెత్తిన అధికారుల్లో గుబులు రేకెత్తుతోంది.

పోస్టింగ్‌లు.. పైరవీలు

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉద్యోగుల బదిలీలు మొదలయ్యాయి. తిరుపతికి అతి సమీపంలోని చంద్రగిరి నియోజకవర్గం ఉండడంతో పోస్టింగ్‌ల కోసం భారీగా డిమాండ్ తలెత్తింది. అందులోనూ నియోజకవర్గ కేంద్రంలో పోస్టింగ్ కోసం పెద్ద ఎత్తున ఉద్యోగులు పైరవీలు చేశారు. ఈ క్రమంలోనే పెద్ద మొత్తంలో నియోజకవర్గ ముఖ్యప్రజాప్రతినిధికి ముడుపులు చెల్లించినట్టు అప్పట్లో దుమారం రేగింది. ఇలా పోస్టింగులు తెచ్చుకున్న ఉద్యోగులు బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచే అక్రమ వసూళ్లకు తెరలేపారు. ఏపనికి వెళ్లినా మామూళ్ల కోసం వేధించడం మొదలు పెట్టారు. కడుపు మండిన బాధితులు ఏసీబీ అధికారులను ఆశ్రయిస్తున్నారు.

ఈవోగా కొనసాగడానికి రూ.50 లక్షలు ఇచ్చా!

'చంద్రగిరి పంచాయతీ ఈవోగా రావడానికి స్థానిక ప్రజాప్రతినిధి సతీమణికి రూ.50 లక్షలు లంచంగా ఇచ్చా. మీలాంటి వాళ్లు ఇవ్వకుంటే నేను ఆ డబ్బు ఎలా సంపాదించాలి. నా కుటుంబం ఏమైపోతుంది. నేను అడిగినంత ఇస్తేనే బిల్లు పాస్ చేస్తా'నని చంద్రగిరి పంచాయతీ ఈఓ మహేశ్వరయ్య తేల్చిచెప్పారు. ఎంబుక్‌లు, రికార్డు చేసినందున రూ.50 వేలు ఇవ్వాలని చిన్నగొట్టిగల్లుకు చెందిన కాంట్రాక్టర్ దినేష్‌ను డిమాండ్ చేశారు. అంత ఇచ్చుకోలేనని చెప్పినా వినకపోవడంతో దినేష్ ఏసీబీని ఆశ్రయించారు. ఈ మేరకు ఈఓ మహేశ్వరయ్య రూ.50 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు.

ఏసీబీ అధికారుల చేతిలో కీలక ఆధారాలు

చంద్రగిరి పంచాయతీ ఈవో మహేశ్వరయ్య లంచగొండుతనమంతా ఏసీబీ అధికారుల చేతుల్లో ఉన్నట్టు సమాచారం. ఏసీబీని ఆశ్రయించిన కాంట్రాక్టర్ దినేష్ దగ్గర సంబంధిత అధికారులు ఒక చిప్ ఇచ్చి అతని ద్వారా పోలీసులు ట్రాప్ చేసినట్టు సమాచారం. నాలుగు రోజుల నుంచి వారిద్దరి మధ్యన జరిగిన సంభాషణ మొత్తం రికార్డు చేసుకున్నట్టుగా తెలుస్తోంది. అందులోనే ఈవో పోస్టుకు రూ.50 లక్షలు స్థానిక ప్రజాప్రతినిధి సతీమణికి అందజేసినట్టుగా చెప్పిన మాటలు కూడా రికార్డు అయినట్టు సమాచారం. ఆ సంభాషణను విన్న తర్వాత ఏసీబీ అధికారులు బాధితుడు దినేష్ చేతికి రూ.50 వేలు ఇచ్చి ఈవో మహేశ్వరయ్యకు ఇప్పించి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

లంచగొండి అధికారుల గుండెల్లో గుబులు

చంద్రగిరి మేజర్ పంచాయతీలో జరిగిన ఏసీబీ దాడులతో నియోజకవర్గంలో కాసులు చెల్లించి పోస్టింగులు తెచ్చుకున్న అధికారుల గుండెల్లో గుబులు పట్టుకుంది. ముడుపులు చెల్లించి లంచావతారం ఎత్తిన అధికారులపై అవినీతి నిరోధక శాఖ అధికారులు మెరుపు దాడులు చేస్తున్నారు. ముఖ్యంగా రెవెన్యూ, పోలీసు, మండల పరిషత్ కార్యాలయం, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, రోడ్లు భవనాల శాఖ అధికారులు కొందరు దీర్ఘకాలిక సెలవు పెట్టడానికి సన్నద్ధమవుతున్నట్లు సమాచారం.

బడ్జెట్‌లో అన్ని వర్గాలకు అన్యాయం

చిత్తూరు కార్పొరేషన్ : పలు రంగాలను దగా చేసే విధంగా బడ్జెట్ ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని పథకాలకు కేటాయింపులు చూపలేదన్నారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటి పథకాలకు కేటాయింపులు తగ్గాయన్నారు. నిరుద్యోగభృతిపై ప్రస్తావన లేదన్నారు. ప్రతిపక్షంలో ఉండగా చంద్రబాబు పలు వరాలు ఇచ్చారన్నారు. ఇప్పుడు అధికారంలో వచ్చాక బడ్జెట్‌లో వారికి మొండిచెయ్యి చూపారన్నారు.

బడ్జెట్‌తో ఒరిగిందేమీ లేదు

చిత్తూరు కార్పొరేషన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వల్ల ఒరిగిందేమీ లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఇరిగేషన్ ప్రాజెక్టులకు పెద్దగా కేటాయింపులు జరగలేదన్నారు. హంద్రీనీవా, గాలేరు–నగరి, సోమశిల, స్వర్ణముఖి కాలువ ప్రాజెక్టులకు నికర నిధులు కేటాయించలేదన్నారు. మార్కెట్ యార్డ్, ప్రకృతి వైపరీత్యాల్లో నష్టపోయిన పంటలకు పరిహారాన్ని చెల్లించడానికి బడ్జెట్లో కేటాయింపు లేదన్నారు. నిరుద్యోగ భృతి, కౌలు రైతులకు రుణాలు, రైతులకు వడ్డీలేని రుణాల ప్రస్తావన లేకపోవడం బాధాకరమన్నారు. వ్యవసాయ పరికరాలు, ఎరువులు, విత్తనాల కోసం ఆశించిన స్థాయిలో బడ్జెట్ ప్రస్తావన లేదని విమర్శించారు.

కిల్లారిపల్లెలో వైద్య శిబిరం

గుడిపాల: కిల్లారిపల్లెలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంలో భాగంగా డాక్టర్ చంద్రమహేష్ మోకాళ్ల నొప్పులు, మంచాన పడ్డ రోగులకు ఇంటివద్దకు వెళ్లి వైద్యం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మహిళలకు ప్రత్యేకంగా వైద్యంతోపాటు గర్భిణులు, బాలింతలకు రక్తపరీక్షలు చేసి ప్రత్యేకంగా వైద్యం అందించారు. బీపీ, మధుమేహం వ్యాధిగ్రస్తులకు చికిత్సలు చేసి మందులను ఉచితంగా అందజేశారు.

రావణబ్రహ్మపై ఆదిదంపతుల విహారం


రావణబ్రహ్మ వాహనంపై విహరిస్తున్న ఆదిదంపతులు

తవణంపల్లె: కాలభైరేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి రావణబ్రహ్మ వాహనంపై ఆదిదంపతులు విహరిస్తూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉభయదారులు ఉదయం స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు చేసి, ధూపదీప నైవేద్యం సమర్పించారు. రాత్రిలో ఉభయదారులు రావణ బ్రహ్మ వాహన సేవను భక్తితో నిర్వహించారు. ఉభయకర్తలు స్వామికి పూజాసామగ్రి, ప్రసాదాలు, గజమాలలు ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. అనంతరం రావణబ్రహ్మ వాహనంపై కొలువుదీరిని ఆదిదంపతులు పురవీధుల్లో ఊరేగారు. శనివారం ఉదయం అభిషేకం, అర్చనలు, రాత్రి నంది వాహన సేవ నిర్వహించనున్నారు.

ఇంటి వద్దనే వైద్య పరీక్షలు

తవణంపల్లె: మండలంలోని కట్టకింద పల్లె, ఎగువ మారేడుపల్లె గ్రామాల్లో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారులు డాక్టర్ కేశవనారాయణ ఎగువ మారేడుపల్లెలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలిచ్చారు. వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ రోగులకు పరీక్షలు చేయించారు. గర్భవతులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి, మందులు అందజేశారు. హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

అధికారులకు ఉద్యోగ విరమణ సన్మానం

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా కేంద్రంలో పలు విద్యాశాఖ అధికారులు శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహిస్తున్న మీరాసాహెబ్, డీఈవో కార్యాలయంలో ఏడీ–1 రంగస్వామి ఉద్యోగ విరమణ పొందారు. డీఈవో వరలక్ష్మి మాట్లాడుతూ రంగస్వామి విధుల పట్ల అంకిత భావంతో విద్యాశాఖకు సేవలందించారన్నారు. అనంతరం ఏడీ–1 దంపతులను డీఈవో, కార్యాలయ సిబ్బంది దుశ్శాలువతో సత్కరించారు. మీరాసాహెబ్‌ను కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపక బృందం దుశ్శాలువతో సత్కరించారు.

శేషజీవితాన్ని ఆనందంగా గడపాలి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లా పశుసంవర్ధశాఖ జేడీ ప్రభాకర్ తన శేషజీవితాన్ని ఆనందంగా గడపాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆకాంక్షించారు. నగరంలో శుక్రవారం ప్రభాకర్ ఉద్యోగ విరమణ సభను ఘనంగా నిర్వహించారు. దీనికి కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రభాకర్ విధి నిర్వహణలో సమర్థవంతంగా వ్యవహరించారని కొనియాడారు. అనంతరం కలెక్టర్ ఆయనకు పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలిపారు. కుటుంబీకులు మనోజ్ ప్రభాకర్, భావన, మిధున్ సాయితేజ్, ప్రహర్ష తదితరులున్నారు.







మీరాసాహెబ్‌ను సత్కరిస్తున్న పీవీకేఎన్ ప్రిన్సిపల్, రంగస్వామి దంపతులను సత్కరిస్తున్న డీఈవో, జేడీ ప్రభాకర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్

నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

బంగారుపాళెం: మండలంలోని పాలేరు గ్రామంలో శనివారం వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు రామాలయ కల్యాణమండపంలో నిర్వహించే సమావేశాన్ని పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ హాజరు కానున్నట్లు తెలిపారు. సమావేశానికి మండల నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

కుల వివక్ష చూపితే కఠిన చర్యలు

తవణంపల్లె: కుల వివక్ష చూపితే కఠిన చర్యలు తప్పవని డిప్యూటీ తహసీల్దార్ వెంకటరమణ హెచ్చరించారు. మండలంలోని కె.పట్నం ఏఏడబ్ల్యూలో శుక్రవారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు. డీటీ వెంకటరమణ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జీవన్, సోషియల్ వెల్ఫేర్ ఆఫీసర్ నాగేశ్వరరావు, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు, ప్రజలు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలను వీడాలి


మ్యాజిక్‌షో నిర్వహిస్తున్న జన విజ్ఞానవేదిక ఉపాధ్యక్షుడు అరుణ్‌శివప్రసాద్

బంగారుపాళెం: ప్రజలు మూఢనమ్మకాలను వీడాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు అరుణ్‌శివప్రసాద్ అన్నారు. మండలంలోని మంగళపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జనవిజ్ఞాన వేదిక 38వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, సైన్స్ దినోత్సవం రోజునే 1988 ఫిబ్రవరి 28న జనవిజ్ఞాన వేదిక ఆవిర్భవించిందన్నారు. అప్పటి నుంచి ప్రజల్లో మూఢనమ్మకాలను పాలద్రోలేందుకు జనవిజ్ఞాన వేదిక అనేక కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం కలిగిస్తున్నట్లు తెలిపారు. సైన్స్ మ్యాజిక్‌షోల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. మ్యాజిక్ షోలో దాగి ఉన్న సైన్స్ నియమాలను విద్యార్థులకు వివరించారు. హెచ్‌ఎం రాజ్యలక్ష్మి మాట్లాడుతూ, విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థి తలపై మంట వెలిగించే మ్యాజిక్‌షోను చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధిపై కనికరించండి : సీపీఐ

చిత్తూరు కార్పొరేషన్: వెనుకబడిన జిల్లా అభివృద్ధికి సీఎం కనికరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ కోరారు. శుక్రవారం చిత్తూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి జిల్లా వాసులైన చంద్రబాబు, కిరణ్‌కుమార్‌రెడ్డి పాలనలో జిల్లా అభివృద్ధిపై దృష్టి పెట్టలేదన్నారు. జిల్లా కేంద్రంలో కేంద్రీయ విద్యాసంస్థల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. చిత్తూరు రైల్వేస్టేషన్‌లో అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగే విధంగా కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా కేంద్రంలో 50 పడకల ఈఎస్ఐ ఆసుపత్రి, చీలపల్లి సీఎంసీలో ఎన్టీఆర్ వైద్య సేవ పథకం అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. హంద్రీనీవా, గాలేరు–నగరి ప్రాజెక్టులు పూర్తి చేసి రైతులకు సాగునీరు ప్రజలకు తాగునీరు అందించాలన్నారు. సమావేశంలో నాయకులు గోపినాథ్, మణి, దాసరిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

వాహనాల చోరీలో ఇద్దరికి జైలుశిక్ష

చిత్తూరు అర్బన్: ద్విచక్ర వాహనాలు చోరీ చేసిన కేసులో వాసు (35), ఈశ్వర్ (34) అనే ఇద్దరు నిందితులకు జైలుశిక్ష విధిస్తూ చిత్తూరులోని నాలుగో అదనపు మునిసిఫ్ మేజిస్ట్రేట్ బాబాజాన్ శుక్రవారం తీర్పునిచ్చారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉమాదేవి కథనం మేరకు.. గతేడాది అక్టోబర్ 24వ తేదీన చిత్తూరు నగరంలో సంతోష్, ఈశ్వర్ కు చెందిన ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. బాధితుల ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన టూటౌన్ పోలీసులు మంగసముద్రానికి చెందిన వాసు అలియాస్ వినోద్‌కుమార్‌ను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. కాణిపాకంలో సుబ్రమణ్యం నాయుడుకు చెందిన ద్విచక్రవాహనం గతేడాది మే నెలలో చోరీకి గురవడంతో కాణిపాకం పోలీసులు కేసు నమోదు చేసి, కోటీశ్వర రావు అలియాస్ ఈశ్వర్‌ను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. నిందితులు ఇద్దరిపై నేరం రుజువు కావడంతో వాసుకు అయిదు నెలల జైలుశిక్ష, ఈశ్వర్‌కు ఎనిమిది నెలల జైలుశిక్ష విధిస్తూ మేజిస్ట్రేట్ తీర్పునిచ్చారు.